పలు పంటలు పరిశీలన



నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని పెద్దతడగూర్, చిన్నఎక్లరాలో సోయాబీన్, కంది పంటలను బిచ్కుంద ఏడీఏ నూతన్ కుమార్, ఏఈఓ సతీష్ సంయుక్తంగా సోమవారం పరిశీలించారు. పంటలో ప్రధానంగా గులాబీ రంగు పురుగు, లద్దె పురుగు, పచ్చ పురుగులు, రసం పీల్చే పురుగులైన తెల్ల దోమ, పచ్చ దోమ, తామర పురుగులు గమనించి వీటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సోయాబీన్ పంటలో ప్రధానంగా కాండపు ఈగ, పచ్చ పురుగు, లద్దె పురుగు ఉధృతిని గమనించి నివారణకు పిచికారీ మందుల గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు దిలీప్, రాజుపటేల్, బస్వరాజ్, బర్దే బస్వరజ్, సునీల్, పోషెట్టీవార్ హన్మంతు, భాస్కర్, బజరంగ్, శివకుమార్, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న మల్లూరు గ్రామస్తులు

నవతెలంగాణ-నిజాంసాగర్

ఎమ్మెల్యే హనుమంత్ షిండేను మండలంలోని మల్లూరు గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే గెలిచిన నుంచి ఇప్పటివరకు గ్రామానికి రాలేదని అన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకున్నానని 2018లో ఎలక్షన్ టైంలో చెప్పి.. తీరా గెలిచిన తర్వాత ఇప్పటివరకు గ్రామానికి రాకపోవడం వల్ల గ్రామ అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని వాళ్లు అన్నారు. మధ్యలో నిజాంసాగర్ ఎంపీపీ పట్లోళ్ల దుర్గారెడ్డి జోక్యం చేసుకొని ప్రజలకు సర్ది చెప్పారు. అయినా వినకపోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే దుర్గారెడ్డి 'ఎక్కడైనా కనిపిస్తే తొక్కి పడేస్తా అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు.' దీంతో ఆగ్రహానికి గురైన మల్లూరు గ్రామస్తులు అధికారం ఉంటే ఏమైనా చేయొచ్చా? ఏదైనా మాట్లాడొచ్చా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార మదంతో మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేనిచో ఎన్నికలప్పుడు తగిన బుద్ధి చెప్తామని గ్రామస్తులు తెలిపారు.

వచ్చే ముందు

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ప్రస్తుత మహిళా బిల్లు పోస్ట్ డేటెడ్ చెక్కు వంటిది
- బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు వచ్చే ముందు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం, నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంపై ప్రధానమంత్రి నిర్ణయాన్ని వెల్లడించాలని అన్నారు. మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌కు రూ.42 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రకటించిన ప్రధాని తెలంగాణను ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. సోమవారం మహిళా రిజర్వేషన్ల సాధన తర్వాత తొలిసారి నిజామాబాద్‌కు వచ్చిన కల్వకుంట్ల కవితకు బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఐటిఐ గ్రౌండ్ నుంచి కలెక్టర్ గ్రౌండ్ వరకు జరిగిన భారీర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. మహిళా బిల్లు ఆమోదం పొంది ప్రపంచంలో ఇతర దేశాల సరసన భారతదేశం నిలబడిందంటే అందుకు బీఆర్ఎస్ పార్టీయే కారణమని స్పష్టం చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టడం మర్చిపోయిందని, వాళ్లను బీఆర్ఎస్ పార్టీ నిద్రలేపిందని తెలిపారు. ఈ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ కూడా తప్పనిసరిగా మాట్లాడే పరిస్థితిని



ర్యాలీలో ఎమ్మెల్సీ కవిత

బీఆర్ఎస్ తీసుకొచ్చిందని అన్నారు. ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మాట్లాడుతోందని, 20 ఏళ్ల కింద కాంగ్రెస్‌కు ఆ తెలివి ఉంటే అప్పుడే బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు న్యాయం జరుగుతుండేదని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌కు ఆ తెలివి లేదని, అధికారం కోల్పోయిన తర్వాత బీసీలు గుర్తుకొచ్చారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని రాహుల్‌గాంధీ అన్నారని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తన స్వప్నమని సోనియాగాంధీ అన్నారని, కానీ అధికారంలోకి రావడం స్వప్నం ఉండవద్దని, తెలంగాణ దళితులు, మైనారిటీలు, బలహీన వర్గాలు, మహిళలు, యువకులు మరింత అభివృద్ధి చెందాలన్న స్వప్నం ఉండాలని సోనియాగాంధీ రాహుల్ గాంధీకి సూచించారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగితే అన్ని వర్గాలు బాగుపడతాయి అన్నది సీఎం కేసీఆర్ స్వప్నమని స్పష్టం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని తేల్చి చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో గత పది ఏళ్లుగా తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పరిపాలిస్తుందని, తమ పార్టీ పాలనలో ఒక్క మతకల్లోలం కూడా జరగలేదని, ఒక చిన్న గొడవ కూడా జరగలేదని చెప్పారు. దేశంలో ఎటువంటి పరిస్థితులు ఉన్నా కూడా తెలంగాణలో శాంతిభద్రతలు సజావుగా ఉన్నాయి కాబట్టే రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని, తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతున్నాయని వివరించారు. అభివృద్ధి ఒకటే కాదు ప్రజలకు ఆత్మగౌరవం ఉండాలన్న ఆలోచన తమ పార్టీదని, అందుకే సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, దేశంలో ఎక్కడా లేనివిధంగా మార్కెట్ కమిటీల పదవుల్లో మహిళలకు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రతి ఒక్క వర్గం గురించి ఆలోచన చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇవన్నీ చేస్తుంటే ఏమి చేయని కాంగ్రెస్ పార్టీ వచ్చి తామే అధికారంలోకి వస్తామని అంటుంటే నవ్వాలో ఏడవాలో అర్థం అవడం లేదని అన్నారు. మన గురించి ఆలోచించే మన నాయకుడు సీఎం కేసీఆర్‌ను కడుపులో పెట్టుకోవాలని కోరారు. నిజామాబాద్‌లో ఎమ్మెల్యే గణేష్ గుప్తా అద్భుతంగా పనిచేస్తున్నారని, ఆయనను మరొకసారి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

అభివృద్ధిలో అగ్రగామి తెలంగాణ

- పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా తెలంగాణ నిలుస్తోందని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో రాష్ట్ర శాసన సభాపతి బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.60 లక్షలతో కురుమ సంఘం నిర్మించుకున్న ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అభివృద్ధికి అగ్రగామి, రైతుకు భరోసా తెలంగాణ ప్రభుత్వంలోనే కొనసాగుతుందని, దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందన్నారు. రాష్ట్రంలో బాన్సువాడ నియోజకవర్గం అన్ని రంగాలలో ముందంజలో ఉందని, ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గం రైతులకు సంవత్సరం మొత్తం పంటలు పండించడానికి నీరు లభ్యమవుతుందని కొడిచర్ల గ్రామంలో చేపట్టిన ఎత్తిపోతల పథకం ప్రారంభం కాకుండానే నేడు నీరు లభ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్తులు వివరించారు.



ఫంక్షన్ హాల్ ప్రారంభం వేడుకలో స్పీకర్

కార్యక్రమంలో సర్పంచ్ పుష్ప భీమరావు, జెడ్పీటీసీ శంకర్ పటేల్, వైస్ ఎంపీపీ బాల్‌ఠాకరే, ఆర్డీవో రాజాగౌడ్, గ్రామస్తులు నగేష్, మున్ని, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కల్లూరు గ్రామంలో గ్రామస్తులు రాబోయే ఎన్నికలలో పూర్తి మద్దతు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అందిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసి అందించారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నాచౌక్ వద్ద ఆశావర్కర్లు సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆశాకార్యకర్తలు అనేక పని ఒత్తిడి తట్టుకొని నిత్యం సేవలు అందించటం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవార్డ్స్ పొందిందన్నారు. కనీస వేతనం నిర్ణయం చేయాలని ఆందోళన చేస్తుంటే నిర్లక్ష్యం వహిస్తూ అందరిని రోడ్ల మీద పడేశారని విమర్శించారు. కనీస వేతనం రూ.18000 ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదని తెలియచేశారు.



సమ్మెను ప్రారంభించి మాట్లాడుతున్న నూర్జహాన్

కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు సుకన్య, లలిత, శోభ, రేవతి, రేణుక, భారతి, సాహేరా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే హనుమంత్ షిండే

నవతెలంగాణ-నిజాంసాగర్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రతి ఒక్క గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని ప్రభుత్వం నిర్మిస్తుందని ఎమ్మెల్యే హనుమంత్ షిండే అన్నారు. సోమవారం మండలంలోని మల్లూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని జుక్కల్ నియోజకవర్గం ఎమ్మెల్యే హనుమంత్ షిండే, దఫేదర్ శోభ రాజు ప్రారంభించారు. అలాగే మత్స్యశాఖ భవనానికి సైతం శంకుస్థాపన చేశారు. అలాగే గోర్గల్ గ్రామంలో బిటి రోడ్డు, ఆంజనేయ స్వామి మందిర పనులకు, మినీ ఫంక్షన్ హాలుకు శంకుస్థాపన చేశారు. అలాగే నిజాంసాగర్‌లో సెంటర్ లైటింగ్ పనులకు, మైనారిటీ షాదీఖానా అలాగే ఎస్టి కమ్యూనిటీ హాల్, హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే అచ్చంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం అలాగే హెల్త్ సబ్ సెంటర్ శంకుస్థాపనకు, అలాగే నేషనల్ హైవే నుండి అచ్చంపేట మీదుగా లింగంపల్లి గ్రామానికి రోడ్డు పనులకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి, వివిధ గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

లైబ్రరీని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా గ్రంథాలయ అభివృద్ధికై పర్మినెంట్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని టీజీవీపీ తెలంగాణ విద్యార్థి పరిషత్ బాన్సువాడ డివిజన్ ఇంచార్జ్ దుంపల తుకారాం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనంపై సరైన నిఘా పెట్టాలని ఆయన అన్నారు. అదేవిధంగా మండలంలోని నడిబొడ్డున గ్రంథాలయం పరిసర ప్రాంతాలు సరిగా లేవని ఆయన అన్నారు. పర్మినెంట్ లైబ్రరీని నిజంసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆకాష్, సింగసాని తేజ, కాంతు తదితరులు పాల్గొన్నారు.

ధర్మ యుద్ధం ర్యాలీకి బయలుదేరిన ముదిరాజ్‌లు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంతో పాటు పరిసర ప్రాంత గ్రామాల నుండి దాదాపు 200 మంది ముదిరాజ్‌లు కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరగబోయే ధర్మ యుద్ధం ర్యాలీకి బయలుదేరుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాడు హన్మండ్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ టికెట్ కేటాయించాలని కామారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ తలపెట్టిన ధర్మాయుద్ధం ర్యాలీకి కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లాలని ముదిరాజ్ సంఘ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆయా పార్టీల్లో కొనసాగుతున్న ముదిరాజ్‌లు తమ హక్కుల కోసం గళం విప్పాలని కోరారు. ముదిరాజ్‌ల హక్కుల కోసం ఐక్యమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొౖరెరాములు, శంకర్, లింగరం, నాందేవ్, కృష్ణ, గణేష్, శ్రీనివాస్, రుక్మయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీకి బయలుదేరిన నాయకులు

గణేష్ నిమజ్జనానికి బందోబస్తు

- పోలీస్ కమిషనర్ సత్యనారాయణ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్



గణేష్ నిమజ్జనానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ వెల్లడించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో గణేష్ మండపాలపై పోలీసుల నిఘా వ్యవస్థ పటిష్టంగా కొనసాగుతుందని వివరించారు. గత నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాలతో పాటు వాటి పరిసర ప్రాంతాల్లోనూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో పోలీస్ కమిషనరేటు పరిధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలకు పోలీస్ భద్రత కల్పించనున్నట్టు వివరించారు. నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో మొత్తం 5405 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో నిజామాబాద్ డివిజన్ పరిధిలో 2502 విగ్రహాలు, ఆర్మూర్ డివిజన్ పరిధిలో 1955 విగ్రహాలు, బోధన్ డివిజన్ పరిధిలో 948 విగ్రహాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు భద్రత కల్పించడం కోసం వ్యూహాత్మకమైన చర్యలు చేపట్టనున్నట్టు వివరించారు. ఆన్‌లైన్ ద్వారా గణేష్ మండపాల రిజిస్ట్రేషన్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించే దిశగా విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన పోలీస్ అనుమతులకై గణేష్ నవరాత్రి నిర్వహాకులు సంబంధిత పోలీస్ స్టేషన్ వెళ్లకుండా తొలిసారిగా ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకున్న గణేష్ నవరాత్రి నిర్వహాకులకు విగ్రహ ఏర్పాటుకు స్థానిక పోలీసులు అనుమతులను మంజూరు చేశారని తెలిపారు.

టేకేదారులందరికీ జీవన భృతి ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-తాడ్వాయి

బీడీ టేకేదారులందరికీ రూ.2016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కన్వీనర్ కే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో 670 మంది టేకేదారులున్నారని, అందరికీ జీవనభృతి ఇస్తానని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 170 మందికి మాత్రమే జీవన భృతి ఇస్తున్నారని తెలిపారు. మిగతా 500 మందికి కూడా జీవన భృతి 2016 రూపాయలు వెంటనే ఇవ్వాలని కోరారు. అలాగే కలెక్టర్ ఈ సమస్యను పరిశీలించి పదిరోజుల్లో టేకేదారుల దరఖాస్తులు తీసుకొని అందరికీ జీవనభృతి ఇచ్చేవిధంగా చూస్తానని హామీనిచ్చారు. తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి కర్రోల్ల సత్యం, టేకేదారులు హనుమాన్లు, తమ్మల రాములు, సాయిలు, లక్ష్మణ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

పార్టీలకతీతంగా దళితబంధు వర్తింపచేయాలి

- దళితసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

నవతెలంగాణ-పిట్లం

దళితబంధు పథకాన్ని పార్టీలకతీతంగా నిరుపేదలైన దళిత కుటుంబాలకు వర్తింపజేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు సురేష్, బాల్‌రాజు మాట్లాడుతూ కొందరు అధికార పార్టీ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి వారి కార్యకర్తలకే దళితబంధు పథకాన్ని వర్తింపచేస్తున్నారని మండిపడ్డారు. మండలంలోని ఆయా గ్రామాలలో వందల సంఖ్యలో దళిత కుటుంబాలు ఉండగా గ్రామానికి 10, 15 మంది చొప్పున గుట్టు చప్పుడు కాకుండా తమ పార్టీకి చెందిన కార్యకర్తలకు కట్టబెడుతూ జాబితాలను తయారు చేస్తున్నారని మండిపడ్డారు. ఎటువంటి గూడు, ఉపాధి లేక దుర్భర జీవితం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత నిరుపేద అర్హులకు అందించకుండా తమ కార్యకర్తలకే ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కొన్ని గ్రామాలలో భూ పంపిణీ, డబుల్ బెడ్ రూమ్, లబ్ది పొందిన కార్యకర్తలకు సైతం దళితబంధులో చోటు కల్పిస్తున్నట్లు ఆరోపించారు. కాగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని సంబంధిత అధికారులకు విన్నవించాలని సలహా మేరకు ఎంపీడీవో కార్యాలయం వద్ద బైఠాయించిన అనంతరం ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన సమాధానమిస్తూ అధికారికంగా జిల్లా నుండి ఎలాంటి దళిత బంధు లెటర్ వెలువడలేదని, మండలానికి అసలు దళిత బంధు రాలేదన్నారు. రాజకీయపరంగా నాయకులు సృష్టించి చెప్తున్నారన్నారు. అందుకుగాను అలాంటి అపోహలు నమ్మవద్దని ఆయన సూచించారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

మండలానికి ముగ్గురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జి.కమాల దోమకొండ బాలికల జిల్లా పరిషత్ పాఠశాల నుండి బదిలీపై వచ్చారు. కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రవీణ్ కుమార్ రాజంపేట్ మండలంలోని కొండాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల నుండి బదిలీపై వచ్చారు. వడ్లమ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లక్ష్మి వల్లభరావు గెజిటెడ్ బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో సోమవారం రోజున పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరికి ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల బృందాన్ని ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

పుల్కల్‌లో మహాజనసభ



మాట్లాడుతున్న చైర్మెన్

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని పుల్కల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో చైర్మన్ మందాడి రామిరెడ్డి ఆధ్వర్యంలో మహాజనసభ నిర్వహించారు. ముందుగా సీఈఓ సాయిప్రకాష్ అర్ధవార్షిక నివేదికలు చదివి వినిపించారు. సహకార సంఘం ద్వారా గత సమావేశంలో చేసిన తీర్మానాలు పెద్దదడిగి, బండరేంజల్ గ్రామాలలో గోదాముల నిర్మాణం కొనసాగుతున్నట్లు తెలిపారు. రైతుల ద్వారా కొన్న ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు తరుగు తీయడం వలన రైతులు నష్టపోతున్నారని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. డీసీసీబీ సమావేశంలో ఈ విషయంపై చర్చించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి రైతు సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలని అధ్యక్షులు రామిరెడ్డి కోరారు. డైరెక్టర్లు సంతోష్, శ్రీనివాస్, సీఈఓ సాయిప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, సర్పంచ్ శివానందప్పా, కిష్టారెడ్డి, భూంశెట్టి, నాగంగంగారం, కొట్టం వీరేశం, నాందేవ్ సంఘం కార్యవర్గ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజ

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని తలమడ్ల గ్రామంలో సోమవారం ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట ప్రధానోపాధ్యాయులుగా బాలచంద్రం

నవతెలంగాణ-బోధన్

గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలలో భాగంగా బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట (జేసీ) ప్రధానోపాధ్యాయులుగా బాలచంద్రం బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన జీహెచ్ఎస్(జేసీ)లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

రోడ్డెక్కిన ఆశా కార్యకర్తలు

నవతెలంగాణ-కోటగిరి

ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆశా కార్యకర్తలు రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు అనురాధ, సుజాత, రేష్మా, స్వప్న, స్రవంతి, పంచశీల, గంగా పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆశాలు

నేడు పోచారం రాక

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నట్లు రజక సంఘం అధ్యక్షులు పెంటయ్య తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం సెప్టెంబర్ 26.2023 www.navatelangana.com

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పల్లి మండల కేంద్రంలో 3 కోట్ల నిధులతో డివైడర్ సెంటర్ లైటింగ్ ప్రారంభోత్సవం చేశారు. కేశ్ పల్లి, సికింద్రాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభిం చారు. బాల్‌నగర్ గ్రామం లో అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జడ్పీటీసి బాజిరెడ్డి జగన్, ఎంపీపీ కుంచాల విమల, జెడ్పీటీసి తనుజ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, సర్పంచులు ఎంపిటిసిలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భాదితురాలిని పరమర్శించిన పోలీస్ కమీషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన తేజశ్రీ సంఘటనకు సంబంధించిన సమాచారం మేరకు సోమవారం నిజామాబాద్ ప్రభుత్వ హాస్పటల్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న బాధితురాలి కుటుంబీకులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ, పరామర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సత్యనారాయణ తేజశ్రీ కుటుంబసభ్యులను కలిసి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారిపై ఎస్‌సి, ఎస్‌టి, హత్యాయత్నం కేసు నమోదు చేశామని, ముద్దాయిని అదుపులో తీసుకుని రెండు టీంలతో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ఫాస్టు ట్రాక్ కోర్టు ద్వారా తొందరగా నిందితునికి శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అమ్మాయికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూపరింటెండెంటు ప్రతిమారాజ్‌కు తెలిపారు.



మొక్కజొన్న పంటను కొనడానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

నవతెలంగాణ-బాల్కొండ

రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి ఈ సీజన్ లో వచ్చే మొక్కజొన్న కొనడానికి ప్రణాళిక చేసుకోవాలని డీపీఎం మారుతి అన్నారు. ఎస్‌పీఎం ఉమాపతి సూచించారు. మండల కేంద్రంలోని మహిళా సహకార సమాఖ్య కార్యాలయాన్ని ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తి దారుల కంపెనీ నిర్వహణ, కంపెనీ ప్రణాళిక గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమాఖ్య ఆదాయాన్ని పెంచుకోవడం కోసం కస్టమర్ హైరింగ్స్ సెంటర్‌కు చెందిన వరి కోత మిషన్ రోజుకు 10 గంటలు నడిచే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపిడి మధుసూదన్, డిపిఎం మారుతి, సమాఖ్య ఏపిఎం పుప్పాల గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పీఎం ఉమాపతి

ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు



ఆశాల సమ్మెకు మద్దతు తెలుపుతున్న రమేష్‌బాబు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేసే ఆశ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెను సోమవారం ప్రారంభించారు. ఆశావర్కర్లు కూడా కనీస వేతనం 18వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని కోరారు. ఈ సమ్మెలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లందరూ ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో కరోనా వచ్చిన వారికి వారే తోబుట్టువుల్లా సేవలు చేశారని, వారి సేవలను మనం జీవితాంతం మర్చిపోలేమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగి కూడా వీరిలాగా సేవలు చేయలేదని, వీరికి ఎంత చేసిన తక్కువని, అన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి కరోనా పేషెంట్లను కాపాడిన మహోన్నతులని అన్నారు. ఆశా వర్కర్లు లేకపోతే రాష్ట్ర పరిస్థితి మరి అధ్వానంగా ఉండేదని, చావు కేకలు మారుమోగేవని ఆయన తెలిపారు కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం నాయకులు సువర్ణ, రేణుక, విజయ, పద్మ, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కుల సంఘాలను మభ్యపెట్టలేవు

కాంగ్రెస్ నాయకుడు సునీల్ రెడ్డి




మాట్లాడుతున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-మోర్తాడ్

బాల్కొండ నియోజకవర్గంలో గత తొమ్మిదిన్నర సంవత్సరాలలో లేనివిధంగా ప్రస్తుతం మంత్రి చేపడుతున్న కుల సంఘాల మధ్య పెట్టడానికి నిధులు మంజూరు అంటూ ఇస్తున్న పత్రాలు కార్యరూపం దాల్చుతాయో.. లేదో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నాయకుడు సునీల్ రెడ్డి ప్రశ్నించారు. స్థానిక ప్రజా నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీలే ప్రస్తుతం కార్యరూపం దాల్చని పరిస్థితిలో ఉండగా ఇప్పుడు ఇస్తున్న హామీలు ఏ మేరకు అమలు అవుతాయో ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. బాల్కొండ నియోజకవర్గం లో దసరా కానుకంటూ మహిళలకు 10 కోట్ల రూపాయలతో చీరలు కొనుగోలు చేసి పంపడానికి సిద్ధంగా ఉంచినట్లు తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి చిల్లర రాజకీయాలను మానుకొని ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తూ సానుభూతి పొందాలని అన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ప్రజలకు నూతన రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడి పుట్టిన పిల్లగాడి జాబితా సైతం రేషన్ కార్డులో లేకుండా ఉందని అన్నారు. ఆరోగ్య శ్రీ ని పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత మీ ప్రభుత్వానికే ఉందని అన్నారు. ప్రస్తుతం మంత్రి తనయుడు బాల్కొండ నియోజకవర్గంలో ప్రతి గణపతి వద్దకు వెళ్తూ యువతను చెడు మార్గాలకు బానిసలు చేస్తు గంజాయి మాయం చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో చేపట్టిన సిసి రోడ్లు, చెక్ డ్యాములు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు, డబుల్ బెడ్ రూమ్ పనుల పై బహిరంగ చర్చకు తాను సిద్ధమని మంత్రికి సవాల్ విసిరాడు. డబుల్ బెడ్ రూములు లోతట్టు ప్రాంతాల్లో నిర్మించి ప్రజలను ఇబ్బందుల పాలు చేశాడని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములు, రవి, దేవ రెడ్డి, రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంకుర్ మొక్కజొన్న సీడ్స్‌తో అధిక దిగుబడి

రైతు రాజేందర్



పంటను పరిశీలిస్తున్న అంకుర్‌సీడ్స్ ప్రతినిధులు

నవతెలంగాణ-ర్యూర్

అంకుర్ మొక్కజొన్న సీడ్స్‌తో అధిక దిగుబడి వచ్చిందని రైతు రాజేందర్ అన్నారు. మండలంలోని పతేపూర్ గ్రామంలో సోమవారం అంకుర్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు ఆర్ఎం హరివర్మ ఎస్‌పి తిరుపతిరెడ్డి, ఎస్టి ప్రవీణ్ రైతు గడ్డం రాజేందర్ మొక్కజొన్న పంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ తన మొక్కజొన్న అధిక దిగుబడి సాధించినందుకు తాను ఎంపిక చేసుకున్న అంకుర్ సీడ్స్ వారి భాస్కర్ హైబ్రిడ్ మొక్కజొన్న అని అన్నారు. విత్తనాలను అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర

- అంగన్వాడి ఉద్యోగులు నినాదాలతో హోరెత్తిన ధర్నా చౌక్
- జక్రాన్‌పల్లిలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతి



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్: మట్టి ఖర్చులతో సరి పెడితే ఊరుకోమని, అధికారులు ఫోజుల కోసమే అంగన్‌వాడీకేంద్రాల తాళాలు పగలగొట్టారని, ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేసిన ఘనత ఈ సమ్మెదేనని, మంత్రి మాటలన్నీ పచ్చి అబద్దాలుఅని, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె ఆపేది లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మండిపడ్డారు. సోమవారం తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మ శవయాత్ర నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధనలు మాట్లాడుతూ..బలం బలగం ప్రభుత్వ యంత్రాంగం ఉంది. ఏదైనా చేయవచ్చని ముఖ్యమంత్రి కెసిఆర్ అనుకుంటున్నారని అన్నారు. అంగన్వాడిలా సత్తా ఏంటో తెలియదని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కాంగ్రెస్ పార్టీకి బాగా తెలుసునని అన్నారు. అంగన్వాడీల సమస్యలను సామరస్యంగా పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని, మట్టి ఖర్చులతో సరిపెడితే ఊరుకునేది లేదు సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తీవ్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, 26వేల కనీస వేతనం ఇవ్వాలని, టీచర్లకు 10 లక్షల రూపాయలు, ఆయాలకు 5 లక్షల రూపాయల బెనిఫిట్‌లు ఇవ్వాలని, పని భారాన్ని తగ్గించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆమె అన్నారు. ప్రభుత్వ యంత్రాంగానికి నిద్ర లేకుండా చేస్తున్న సమ్మెగా అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె చరిత్రలో నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ ధోరణిలో సమ్మెకు ఆటంకాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్న అంగన్వాడి ఉద్యోగులు ఎక్కడ వెనుకడుగు వేయకుండా ఢీ అంటే ఢీ అనే విధంగా కేసీఆర్ కు సవాల్ విసురుతున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పాటు కాకముందు అనేక విషయాలలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు వాటిని పూర్తిగా విస్మరించారు విమర్శించారు. అంగన్వాడీలు వర్కర్లు కాదని టీచర్లు అని పేర్కొన్న కెసిఆర్ వారి సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. స్వరాష్ట్రంలో కూడా అంగన్వాడి ఉద్యోగులు చాలీచాలని వేతనాలు ఉన్నాయని ఆవేదన చెందారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడే మాటలు పచ్చి అబద్దాలని మండిపడ్డారు. తమిళనాడు, పాండిచ్చేరిలో అంగన్వాడీ ఉద్యోగుల విషయాలపై మాట్లాడమంటే, వాటిని మినహాయించి మిగతా రాష్ట్రాలని పరిస్థితుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కేరళలో 12వేలు వేతనం ఇస్తే 6వేల రూపాయలు ఇస్తున్నారని మంత్రి చెప్పడం దౌర్భాగ్యమన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు జీతం ఎంత ఉందో తెలియని మంత్రి ఎలా ఆ పదవిలో రాణిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అంగన్వాడీ ఉద్యోగులపై ఏమాత్రమైన మంత్రికి అవగాహన ఉందా.. అని ప్రశ్నించారు. రోడ్డుపైకి వచ్చి సమ్మె చేస్తున్న అంగన్వాడి ఉద్యోగులతో కాకుండా ఇతర సంఘాలు ఉద్యోగు నాయకులతో చర్చలు జరపడం ఎంతవరకు సబమన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అంగన్వాడీ టీచర్లకు సంక్షేమ పథకాలను అన్నింటిని దూరం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడి యూనియన్ నాయకత్వాన్ని పిలిపించి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వర్ణ, సందీప, సునీత, జరీనా, సరిత, సునీత, శివ, రాజమ్మ, సుజాత రాధికా, స్వప్న, విజయ, రేణుక, సందీప, గోదావరి, సందీప, స్రవంతి రాణి పాల్గొన్నారు.

ఆర్మూర్: తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ జెయింట్ యాక్షన్ కమిటీ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఎమ్మార్వో శ్రీకాంత్ కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్‌యూనియన్ అధ్యక్షురాలు చంద్రకళ, సిఐటియు మండల కన్వీనర్ కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు 48 సంవత్సరాలకు పైగా ఐసిడిఎస్ లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారు. అయినా వీరికి కనీస వేతనం పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలేవి రాష్ట్ర ప్రభుత్వం నేటికీ కల్పించలేదన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. తమిళనాడు, కర్ణాటకలో హెల్త్ కార్డులు ఇచ్చారని, పశ్చిమబెంగాల్, కేరళ, అస్సాం తదితర రాష్ట్రాలలో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్, వెల్ఫేర్‌బోర్డు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కర్ణాటక రాష్ట్రంలో గ్రాట్యుటీ చెల్లిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో అంగన్వాడి టీచర్లకు, ఆయాలకు సౌకర్యాలు కల్పించాలని సమ్మె ప్రారంభమై నేటికీ 15 రోజులు అవుతున్న ప్రభుత్వం ఆలోచించడం లేదని నిర్బంధంతోపాటు బెదిరింపులు చర్యలకు పాల్పడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడి సెంటర్ల తాళాలు పగలగొట్టి ఆశా వర్కర్లు, ఆర్పీలు, గ్రామపంచాయతీ కార్యదర్శులతో సెంటర్లు నడిపిస్తామని మంత్రి సత్యవతి రాథోడ్ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. బెదిరింపులకు అదరం, బెదరం, సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగిస్తాం అని అన్నారు. త్వరగా కార్మిక జేఏసీని చర్చలకు పిలిచి యొక్క సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సిద్దల నాగరాజు, ఎస్ఎఫ్ఐ జవహర్ సింగ్, బి రవి, సునంద, జగదాంబ ,లక్ష్మి, లావణ్య ,ఆయాలు టీచర్లు పాల్గొన్నారు..

మోపాల్: మండలంలోని తహసీల్దార్ ఆఫీస్ ముందు సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు అంగన్వాడి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. రమేష్ బాబు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లు మహిళలు సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉద్యమాన్ని నీరుగార్చడం కోసం అంగన్వాడి ఉద్యోగులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ దేశంలో ఎవ్వరూ ఇవ్వనంత వేతనాలు ఇస్తున్నామని అబద్ధపు ప్రచారం చేస్తూ చర్చలకు పిలవకపోవడం సరైనది కాదని అన్నారు. వారు కూడా తెలంగాణ బిడ్డలేనని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు దేశంలో ఎవరికి ఇవ్వలేనంత వేతనాలు సౌకర్యాలు తెలంగాణలోనే అమలు జరుగుతున్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. పక్కనే ఉన్న తమిళనాడు, చిన్న రాష్ట్రమైన పాండిచ్చేరి అక్కడ అంగన్వాడి ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సుమారు 20వేల వరకు వేతనమిస్తుందని తెలిపారు. కర్ణాటక పశ్చిమబెంగాల్ అస్సాం తదిత రాష్ట్రాలలో ఎక్కువ సౌకర్యాలు ఇస్తున్నారన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ పెన్షన్, పండగ బోనస్, హెల్త్ కార్డులను అమలు జరుపుతున్నారని ఆయన తెలిపారు. కేవలం తెలంగాణ ప్రభుత్వం మాత్రమే అంగన్వాడీ టీచర్లపై కక్ష సాధింపు చర్యకు పాల్పడుతుందని, ఇటువంటి పరిస్థితిని తట్టుకునేది లేదని జిల్లా వ్యాప్తంగా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కూడా ధర్నా నిర్వహిస్తామని వారికి న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లీడర్లు నాయకులు రాజ్యలక్ష్మి సూర్యకళ ,రేణుక, విజయ, సువర్ణ, సుజాత, మరియు రజిత ,తదితరులు అంగన్వాడీ టీచర్లుచ ఆయాలు పాల్గొన్నారు

జక్రాన్‌పల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతిపత్రం సమర్పించినట్లు అంగన్వాడి ఉద్యోగులు తెలిపారు. మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతిపత్రం సమర్పించారు. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతన 26వేలు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తాసిల్దార్‌కు సైతం అంగన్వాడి ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న కుతాడి ఎల్లయ్య



మోపాల్‌లో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



జక్రాన్‌పల్లి : వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కోటిన్నరకు కుచ్చుటోపీ

- నందిపేట్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- లబోదిబోమంటున్న బాధితులు

నవతెలంగాణ నందిపేట్

అమాయక ప్రజలను ఆసరా చేసుకుని ఓ వ్యక్తి సుమారు కోటిన్నర రూపాయలతో ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి విశ్వప్రసాద్ అనే వ్యక్తి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రుద్రంగి నుంచి వలస వచ్చి 18 సంవత్సరాల నుంచి మండలంలోని తల్వేదలో కుటుంబంతో కలసి నివాసం ఉంటున్నాడు. వచ్చినప్పటి నుంచి ఊరిలోనే మెడికల్ షాప్ పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే మెడికల్ షాపు నడిపిస్తూ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరిని పరిచయం చేసుకొని మెడికల్ షాప్‌తో పాటు ఫైనాన్సు చిట్టీలు కూడా నడిపేవాడు. అనారోగ్యంతో బాధపడేవారు తన వద్దకు వస్తే మందులు తక్కువ ధరకే ఇస్తానని నమ్మబలికి ఇలా పరిచాయలాన్ని పెంచుకున్నాడు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా విశ్వప్రసాద్ వద్ద చిట్టీలు బాగానే వేశారు. నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టడంతో అప్పులు పెరగడంతో డబ్బులు సర్దుబాటు కాలేదు. ఏం చేయాలో దిక్కుతోచక కుటుంబ సభ్యులను వదిలి ఇరవై రోజుల క్రితం పరారయ్యాడు.అనోట ఈ నోటా విషయం తెలిసే సరికి గ్రామస్తులు షాక్‌కు గురయ్యారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు కూడా తెలుస్తోంది. ఇంటి నిర్మాణాలు, కుటుంబ సభ్యుల పెళ్లిల కోసం దాచుకున్న డబ్బులు మెడికల్ షాపు నడుపుతున్న కోటగిరి విశ్వప్రసాద్ ను నమ్మి కట్టినట్లు బాధితులు వాపోతున్నారు. విశ్వప్రసాద్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో బాధితులు పోలీసులకు పిర్యాదు చేస్తే డబ్బులు రావేమోనని ఏమి చేయాలో తెలియక తమలో తామే నలిగిపోతున్నారు. భవిష్యత్తులో తమ పిల్లల కొరకు పొదుపు చేసుకున్న డబ్బుతో పరారీ కావడంతో గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయంపై ఎస్సై రాహుల్ ని నవతెలంగాణ సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.



పొదుపు చేసేవారే టార్గెట్...

మండల కేంద్రంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా చూసుకున్నట్లయితే భవిష్యత్తులో తమ పిల్లల కొరకు పొదుపు చేసుకునే వారిని ఆసరా చేసుకుని ఇలాంటి వారు ఈ ఘటనకు పాల్పడుతున్నారు. ఉమ్మడి నందిపేట మండల కేంద్రంలో గతంలో దత్తాపూర్‌కు చెందిన ప్రభుత్వ టీచర్ సుమారు మూడు కోట్లతో పరారయ్యాడు. గత ఆర్నెల్ల క్రితం గంగా సముందర్‌లో రేషన్ డీలర్ రూ. రెండు కోట్ల వరకు కుచ్చుటోపి పెట్టి పరారయ్యాడు. ఇలా వరుస ఘటనలు జరగడంతో మండలంలోని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

రేషన్ కోసం తంబింగ్ వద్దు

- ఐద్వా డిమాండ్
- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్

రేషన్ షాపులపై తంబింగ్ సిస్టం వద్దని, పాత విధానమే కొనసాగించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు అనిత, జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు. దీనిపై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తంబింగ్‌కోసం డీలర్లు ఈనెల చివరి వరకే లాస్ట్ డేట్ అని ప్రజలకు చెప్పడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాలకు కూలి పనికి వెళ్లినవారు.. చదువుకోసం హాస్టల్లో ఉండే పిల్లలు, పైచదువులకోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళిన విద్యార్థులకు అనుమతి ఇవ్వకపోవడంవల్ల వారంరోజులే టైం ఉండడంవల్ల తంబింగ్ ఎలా సాధ్యమని అన్నారు. కొత్త విధానాలవల్ల ఇబ్బందుల పాలు చేయడం తప్ప ఎలాంటి ప్రయోజనాలు లేవని తెలిపారు. అలాగే కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారికి అమలు జరిగేలా చూడాలని అన్నారు. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని అన్నారు. రేషన్ షాప్‌లపై 14 రకాల వస్తువులు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు, లావణ్య, నాయకులు కళావతి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఐద్వా నాయకులు

నారాయణ పాఠశాల రాష్ట్ర స్థాయిలో ఎంపిక

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని నారాయణ పాఠశాల విద్యార్థి ఎస్ఎల్ఎన్. రిత్విక్ (6వ తరగతి) ఖేలో ఇండియాలో పాల్గొని జిల్లాలోనే మొదటి స్థానం కైవసం చేసుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఏజీఎం శివాజీ పాటిల్, ప్రిన్సిపాల్ జ్యోత్స్న విద్యార్థికి సన్మానించి గోల్డ్ మెడల్ బాహుకరించారు. స్కూల్ యాజమాన్యం ఏజీఎం శివాజీ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని ప్రోత్సాహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి, డిజీఎం కరుణాకర్, ఏజీఎం శివాజీ పాటిల్, ప్రిన్సిపాల్ జ్యోత్స్న సంచేటి, పిఈటి శ్రీనివాస్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థికి గోల్డ్‌మెడల్ అందజేసిన యాజమాన్యం

బాధ్యతలు స్వీకరించిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఏర్గట్ల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పసుపుల సాయన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్‌లోని గూపన్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సాయన్న పదోన్నతిపై కమ్మర్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా నియమితులయ్యారు. సాయన్న స్వగ్రామం మండలంలోని ఉప్లూర్ గ్రామం. కమ్మర్ పల్లి ఉన్నత పాఠశాలలో 2005 నుండి 2015 వరకు సాయన్న ఉపాధ్యాయుడిగా నిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సొంత మండల కేంద్రంలోని పాఠశాలకు పదోన్నతిపై రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన సాయన్నను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

ఏర్గట్ల: మండలంలోని తడ పాకల్ ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా అబ్దుల్ జావేద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.జగిత్యాల జిల్లాలోని కోరుట్ల బాలికల పాఠశాల లో స్కూల్ అసిస్టెంట్ హిందీ బాధ్యతలు నిర్వహిస్తున్న అబ్దుల్ జావేద్ పీజీ హెచ్ఎం ప్రమోషన్‌లో తడపాకల్ పాఠశాలకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను ఉపాధ్యాయ బృందం శాలువాతో పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

బల్దియా కార్మికులతో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి

నవతెలంగాణ-బోధన్‌టౌన్

భారతీయ జనతా పార్టీ సిద్ధాంత కర్త అయిన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సోమవారం బిజెపి బోధన్ నియోజకవర్గ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ బోధన్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను శాలువాలతో సన్మానించి, వారితో కలిసి అల్పాహారం చేశారు. కార్యక్రమంలో బిజెపి బోధన్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్ చిన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అరవింద్, పట్టణ ఉపాధ్యక్షుడు గాదె సందీప్, బిజేవైఎం పట్టణ అధ్యక్షుడు పెర్క వెంకటేష్, ఎస్టీ మోర్చ పట్టణ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జయంతి వేడుకల్లో నాయకులు

ఫార్మసిస్ట్ విమలకు సన్మానం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్ డే సందర్భంగా ఫార్మాసిస్ట్ విమలను జడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్ ప్రజాప్రతినిధులు సోమవారం శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి తీర్మాల్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఫార్మసిస్ట్ సేవలు ఆసుపత్రికి చాలా అవసరమని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుట్ట బాపురెడ్డి, రైతుబంధు జిల్లా సభ్యులు అండెం శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, కానుగంటి నాగరాజు, వైద్యాధికారి సంగీత్‌కుమార్ పాల్గొన్నారు.


విమలను సన్మానిస్తున్న దృశ్యం

అంగన్వాడీల పట్ల చిన్నచూపు

- **15వ రోజుకు నిరవధిక సమ్మె**

నవతెలంగాణ-విలేకరుల బృందం

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అంగన్‌వాడీ టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 15వ రోజుకు చేరుకుంది.

తాడ్వాయి : అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు సిఐటీయు కామారెడ్డి జిల్లా కమిటీ పక్షాన పూర్తి మద్దతు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి జేఏసీ నాయకులను పిలిపించి ఎంత తొందరగా సమస్యను పరిష్కరిస్తే అంతా మంచిదన్నారు. ఆలస్యం అయ్యే కొద్దీ ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26,000 ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్‌కి 10 లక్షలు ఇవ్వాలని, హెల్పర్‌కి 5లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో మండల అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం నుంచి నంది విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నందివిగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. వాహనాలు నిలిచిపోయాయి. గౌరవ వేతనం మాకొద్దు కనీసవేతనం కావాలని పిలుపునిచ్చారు. సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిద్ధలక్ష్మీ, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నుండి గాంధీచౌక్ వరకు ర్యాలీగా వచ్చి జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరవధిక సమ్మె 15వ రోజుకు చేరుకున్న తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం


తాడ్వాయి : నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు


బోధన్ టౌన్ : పట్టణంలో..

స్పందించకపోవడం చాలా సిగ్గుచేటని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక స్కీములలో అనేకమంది ఉద్యోగులకు దేశవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు నెలకు కనీసం లక్ష నుంచి 2 లక్షల జీతాలు ఇస్తున్నప్పటికి వారి కంటే ఎక్కువ సేవ నిరంతరం చేస్తున్నటువంటి అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడం ఏంటని మండిపడ్డారు. అంగన్వాడీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలింతలకు, గర్భవతులకు, చంటి పిల్లలకు ఒకటో సంవత్సరం నుండి 5 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు తల్లితండ్రుల కంటే ఎక్కువ సేవ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీలపై అనుసరిస్తున్న వైఖరి సరైన విధానం కాదని అన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారం చేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు నిరసన కార్యక్రమం ఆపబోమని స్పష్టం చేశారు. కనీస వేతనం 26000 రూపాయలు ఇవ్వాలని పెన్షన్, ఈ.ఎస్.ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి ఐదులక్షల ప్రమాద బీమా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ చంద్రకళ, పద్మ జ్యోతి, రేణుక, కమల, చంద్రకళ, హెల్పర్స్ వర్కర్ పాల్గొన్నారు.

పిట్లం : తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం స్పందించకపోవడంతో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మండల పరిషత్ కార్యాలయం ముందుగా ఆర్అండ్‌బీ రోడ్డుపై చేస్తున్న సమ్మె శిబిరం నుండి పలు నినాదాలతో అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకొని మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమ్మె సోమవారం నాటికి 15 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వయసు పైబడిన టీచర్లు, ఆయాలు కొందరు బిపి, షుగర్, కోలస్ట్రాల్, రుగ్మతలతో బాధపడుతున్నారని అన్నారు. కలెక్టర్ ముట్టడి, రోజు నిద్రాహారాలు లేక చతికిలా పడుతున్నామని, తక్షణమే ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలిచి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమ్మెపట్ల ప్రభుత్వం కాలయాపన చేయకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ప్రభుత్వ ఇదే ధోరణి అవలంబిస్తే ప్రాణాలను సైతం పణంగా పెట్టి సమ్మెను తీవ్రతరం చేసి, రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో కెసిఆర్ ప్రభుత్వానికి సరియైన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాధా, పిట్లం, రాంపూర్, చిన్నకొడప్‌గల్ సెక్టర్‌ల లీడర్లు జంగం సుమలత, అన్నారం అనురాధ, కారేగాం అనురాధ, సుజాత, జగదీశ్వరి, గౌరవ్వ, పార్వతి, మంగమ్మ, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రామారెడ్డి : అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం గత 15 రోజుల నుండి, వివిధ పద్ధతులతో నిరసన తెలుపుతూనే ఉన్నారు. సోమవారం మండల కేంద్రంలో మానవహారాన్ని నిర్వహించి, తాసిల్దార్ కార్యాలయం ముందు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి, అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పద్మజ, ఇందిరా, సుజాత, అమృత, వెంకటలక్ష్మి సావిత్రి, రాజేశ్వరి, శ్రీదేవి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ టౌన్ : అంగన్వాడీలు ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా చేసి నిరసన తెలియజేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకూ పోరాటం చేస్తామన్నారు. 15 రోజులుగా అంగన్వాడిలు పోరాడుతుంటే తండ్రి లాంటి కెసీఆర్ పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జే. శంకర్‌గౌడ్, టీచర్లు విక్టోరియా, రాణి, అనీస్, ఉమా, లావణ్య, రేణుక, సత్యగంగ, సవిత, శ్యామల, శారద, రమాదేవి, ఆయాలు గంగమణి, కవిత, రేఖ, సావిత్రి, అంజలి, సుష్మ, సుమ, మీరా తదితరులు పాల్గొన్నారు.


రామారెడ్డిలో..



పెద్దకొడప్‌గల్‌లో..

సార్వజనిక్ ఉత్సవ కమిటీకి 51వేలు అందజేత

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వరయంలోని సార్వజనిక్ ఉత్సవ కమిటీకి 51వేలు అలాగే, అన్నదానంకి 30వేల రూపాయలు బోధన్ ఎమ్మెల్యే నివాసంలో సోమవారం బోధన్ ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా ట్రస్టు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, శివాలయం చైర్మన్ బీర్కూర్ బుజ్జి, మారుతి మందిర్ చైర్మన్ అశోక్ రెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రుద్ర సత్యనారాయణ, విడిసి కోశాధికారి కొంద్ర వెంకట్, గుమ్ముల శంకర్, పూజారి లింగం, జేఏసీ శంకర్ పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

పోలీస్ బందోబస్తుల మధ్య ఘనంగా వినాయక నిమజ్జనం

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం నీలా, నీలా క్యాంప్, కళ్యాపూర్ గ్రామాలలో గణేష్ నిమజ్జన శోభాయాత్రలు ప్రశాంతంగా ముగిసింది. సార్వజనిక్ గణేష్ మండలి వద్ద స్థానిక నాయకులు రాఘవేందర్, క్యాతం యోగేష్, ఎస్సై ఉదయ్‌కుమార్ సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. గ్రామంలోని వినాయకులు ఒకరి తర్వాత ఒకరిని పంపించడానికి నాయకులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. సమస్యాత్మక గ్రామమైన నీల గ్రామంలో ఎలాంటి ఘర్షణలకు తావివ్వకుండా పోలీస్ బలగాలను మోహరించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగింది.

నీలా గ్రామాన్ని సందర్శించిన మేడపాటి ప్రకాశ్ రెడ్డి..

గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంత వాతావరణంలో శోభయాత్ర నిర్వహించుకోవాలని బోధన్ నియోజకవర్గ బిజెపి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి నీలా గ్రామంలోని గణేష్ మండపాలను సందర్శించి యువతకు ఎలాంటి ఘర్షణలకు తావివ్వకుండా శోభాయాత్ర నిర్వహించుకోవాలన్నారు. ఆయన వెంట బిజెపి మండల అధ్యక్షులు గోపి, ఖ్యాతం యోగేష్, మేక సంతోష్, యువత తదితరులు పాల్గొన్నారు.


వినాయక నిమజ్జనం సందర్భంగా శోభాయాత్ర

ఆశావర్కర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలి

- **పలుచోట్ల నిరసనలు**

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : ఆశావర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం 18000 మంజూరి చేయాలని కోరుతూ ఆశవర్కర్లు సోమవారం బోధన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆశావర్కర్లకు పారితోషికాలను రూ.18,000/-లకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారని, మహిళలు బడుగు, బలహీనవర్గాలకు చెందినవారు కావడంతో ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక శిక్షణలు పొందారని అన్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తు ఎప్పటికప్పుడు ప్రజలకు, గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలకు సేవలందిస్తున్నారని అన్నారు. ఆశవర్కర్లు వెట్టి చాకిరి చేస్తున్న వారికి కేవలం రూ.9,750/-లు పారితోషికాలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్నదని పేర్కొన్నారు. కావున పెరుగుతున్న ధరలకను గుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను రూ.18,000లకు పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ఆశాలకు పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆశాలకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 5 లక్షలు ఇవ్వాలని, ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం, జిఎన్ఎం పోస్టుల్లో ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, అంత్యక్రియల ఖర్చులు రూ.50,000లు చెల్లించాలిని, పారితోషికం లేని అదనపు పనులు ఆశాలతో చేయించకూడదన్నారు. టిబి స్పూటమ్ డబ్బాలను ఆశాలతో మోయించే పనిని రద్దు చేయాలన్నారు. టి.బి. లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, లెప్రసీ సర్వేలో వస్తున్న ఇబ్బందులను పరిష్కరించాలని, ఆశాలకు పనిభారం తగ్గించి, జాబ్ చార్ట్‌ను విడుదల చేయాలన్నారు. లేని యెడల సెప్టెంబర్ 25 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందర ఆశకార్యకర్తలు సోమవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పారితోషకం కాదు.. పిక్స్‌డ్ వేతనం కావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాగ్యలక్ష్మి, యం.సవిత, ఆర్.సావిత్రి, యం.శ్యామల, డి.సరస్వతి, రహిమున్నిషా, గంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : ఆశావర్కర్లకు రూ.18వేలు వేతనం చెల్లించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో ఎడపల్లి మండల ఆశావర్కర్లు సమ్మెకు దిగారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సిని ఏరియాస్ వెంటనే ప్రభుత్వం చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.1000 చొప్పున 16 నెలల బకాయి డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఆశలకు ప్రసూతి సెలవులపైన సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల జిల్లా సంఘం అధ్యక్షురాలు ఇనుమ రాజమణి, విజయ, కుంట అనిత, స్వరూప, అనసూయ, అబ్బవ్వ, పంచశీల, స్వరూప, దేవ కరుణ, విజయలక్ష్మి అనిత పాల్గొన్నారు.

రెంజల్ : తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశావర్కర్ల పనిభారం విపరీతంగా పెరిగిందని, వారి పనికి తగిన వేతనాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషకాలను 18వేల రూపాయలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనంగా నిర్ణయించాలన్నారు. ఆశలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తూ ఉద్యోగ భద్రతను కల్పించాలని ఆయన అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం ఐదులక్షలు, ఆశలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాసిల్దార్ రామచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, రేవతి, శ్యామల, పద్మ భాగ్య నాసియా, రూపా, లక్ష్మి కవిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.


బోధన్ : మాట్లాడుతున్న శంకర్‌గౌడ్


సదాశివనగర్‌లో..

గణేష్ నిమజ్జనాలు శాంతియుతంగా చేపట్టాలి

- **ఎస్సై కృష్ణారెడ్డి**


మాట్లాడుతున్న ఎస్సై కృష్ణారెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

గణేష్ ఉత్సవాల్లో భాగంగా గణేష్ నిమజ్జనాలు శాంతియుతంగా జరుపుకోవాలని మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డి గణేష్ మండల్ల నిర్వాహకులకు తెలియజేశారు. గణేష్ ఉత్సవాలపై సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ శాంతి కమిటీ సమావేశానికి మండల కేంద్రంతో పాటు ఉమ్మడి మద్నూర్ మండలంలోని అన్ని గ్రామాల గణేష్ మండల నిర్వాహకులకు నిమజ్జనాలపై ఎస్సై అవగాహన కల్పించారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు జరుపుకోవాలని కోరారు. డీజేలకు అనుమతులు లేవని ఏ గ్రామంలోనైనా సీరియల్ ప్రకారం నిమజ్జన కార్యక్రమాలు సమయపాలన పాటించి జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ సర్పంచ్ సురేష్, ఎంపిటిసిలు, మండలంలోని గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

బాగేపల్లి సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి సార్వజనిక్ గణేష్ మండపాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ పదివేల రూపాయలు అందజేయగా, గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాముల సాయిలు, గ్రామ కమిటీ సభ్యులు ఆటో సాయిలు, గోపాల్, సురేందర్‌గౌడ్, సాయగౌడ్, సుభాష్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, సాయిలు, యువత ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

- **చైర్మెన్ సాయికుమార్**


మాట్లాడుతున్న చైర్మెన్

నవతెలంగాణ-గాంధారి

రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని చైర్మెన్ సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం పీఏసీఎస్ చైర్మన్ పెద్దబూరి సాయికుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి మోహన్‌రెడ్డి సొసైటీ లవాదేవీలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ సాయికుమార్ మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సొసైటీని అభివృద్ధి చెయ్యాలని రైతులకు సూచించారు. అలాగే ఎరువుల కొరత లేకుండా అన్ని రకాలైన ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో పొతంగల్ కలాన్ సర్పంచ్ వడ్ల బాలరాజు, గాంధారి ఎంపీటీసీ సభ్యులు పత్తి శ్రీనివాస్, సొసైటీ వైస్ చైర్మన్ ఉదల్ సింగ్, సొసైటీ డైరెక్టర్లు ధోల్లు సాయిలు, రొడ్డ అశోక్‌రెడ్డి, ఆర్ల శివాజీరావు, కోనింటి మణెవ్వ పోచయ్య గొల్ల హర్షయ్య, పయ్యల జనార్ధన్, గోవింద్ గణపతిరావు, రాథోడ్ నెహ్రూ రైతులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం వేడుకలు

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ వినాయకుని నిమజ్జనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి లడ్డు వేలం పాట నిర్వహించగా మాలిస్ కమలాకర్ రావు 10000కు లడ్డును దక్కించుకున్నారు. ఆయనకు సంఘ సభ్యులు లడ్డును అందజేశారు.

కళ్యాపూర్‌లో సిసి డ్రైనేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కల్యాపూర్ గ్రామంలో సోమవారం స్థానిక నాయకులు సీసీ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. పార్లమెంటు సభ్యుల ప్రత్యేక నిధుల నుంచి నాలుగు లక్షల రూపాయలు మంజూరు కాగా అట్టి నిధులతో పనులు ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు కాశం సాయిలు, బిజెపి నాయకులు గంగదాసు, బాలయ్య, పోశెట్టి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద అన్నదానాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయాగ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కుల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని బషీరాబాద్ గ్రామంలో డ్రాగన్ యూత్ గణపతి వద్ద అన్న దానం చేశారు. డ్రాగన్ యూత్ అధ్వర్యంలో నిజామాబాద్ లిటిల్ స్మైల్ ఫౌండేషన్ కు చెందిన అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కారం అశోక్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బైకన్ మహేష్,యూత్ అధ్యక్షులు బందెల రాజు, ఆకుల నారాయణ, ఎల్లన్న, డ్రాగన్ యూత్ అధ్యక్షులు తరుణ్, అరవింద్, సుకేష్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కేటాయింపు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం లాటరీ పద్ధతి ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు లబ్ధిదారులకు కేటాయించారు. మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇదివరకే 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఎంపికైన ఇండ్లను బ్లాక్ వైజ్ గా నెంబర్లు వేయడం జరిగిందని తెలిపారు. వాటిని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో డ్రా పద్ధతి ద్వారా ఫ్లాట్ లను 100 మంది లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందని తహశీల్దార్ అడప శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వినోద్, సర్పంచ్ బూస సునీత ,ఉపసర్పంచ్ షేక్ వాహబ్, బిఆర్ఎస్ నాయకులు వై. లింగాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగుల పల్లి సూరజ్, కన్న పోశెట్టి, మామిడి రాకేష్, ఎం ఎ షాహిద్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాజ్ అలీ తదితరులు వున్నారు.

నల్లబ్యాడ్జీలతో మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బోర్గాం పి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ పాల్గొని మాట్లాడారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎండీఎం కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దశల వారి ఆందోళనలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, ముఖ్యమంత్రి గత సంవత్సరం మే నెలలో అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుండి గౌరవ వేతనం 3000 రూపాయలు పెండింగ్ ఏరియర్స్ తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని, ప్రభుత్వమే గుడ్లను సరఫరా చేయాలని, కార్మికులందరికీ యూనిఫాం లు , పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కొత్తగా వంట పాత్రలను ఇవ్వాలని వంట షెడ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందించకపోతే ఈనెల 28 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర కో కన్వీనర్ ధ్యారంగుల కృష్ణ, మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులు శేఖర్, అశోక్, రాజేందర్ రెడ్డి, జులై కా బేగం, మౌనిక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యశోధక్ సమాజ్ 150వ ఆవిర్భావ మహోత్సవం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మండల అంబేద్కర్ యువజన సంఘం, సీపీఐ యం.యల్(ప్రజా పంథా),ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సత్యశోఢక్ సమాజ్ 150 సంవత్సరాల ఆవిర్భావ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతరావు పులే, సావిత్రి బాయి పులే దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పులే దంపతులు 1848 నుండి 1873 వరకు 25సంవత్సరాలు ఈ దేశంలో మొట్టమొదట బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు విద్యను అందించడానికి విద్యా ఉద్యమం నడిపారన్నారు. ఈ విద్యా ఉద్యమ చైతన్యాన్ని సంస్థాగత నిర్మాణంలోకి తేవడానికి సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను ప్రారంభించి ఈ దేశ బహుజనుల సత్యవంతమైన స్వాతంత్ర ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. సత్యశోధక్ సమాజ్ ద్వారా మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమించారన్నారు. పురోహితుల ద్వారా ఏర్పడిన అసత్యమైన సమాజ వ్యవస్థలో సత్యాన్ని శోధించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. అందులో ప్రధానంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించడం, కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు నిర్వహించడం ముఖ్యమైన వన్నారు. సత్యశోధక్ ఆదర్శ వివాహాలు, నామకరణ మహోత్సవాలు, కేశఖండనాలు, జ్ఞాన వస్త్రధారణ, మొదలగు అనేక సంఘసంస్కరణ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. రైతులను తమ కాళ్లపై తాము నిలబడే విధంగా రైతు ఉద్యమాలను,, పలు సంస్కరణలను చేశారన్నారు. దీన్ని ముందుకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యత మనందరిపై ఎంతైనా ఉందని సత్యశోధక్ సమాజ్ ప్రాముఖ్యత



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

వివరించారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్, మండల కార్యదర్శి గుర్రం నరేష్, సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా మండల కార్యదర్శి బి.అశోక్, అఖిల భారత ప్రగతి శీలా రైతు సంగం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘా జిల్లా కార్యదర్శి జి. కిషన్, మండల అంబేద్కర్ యూత్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గ్రూప్-1 పరీక్ష రద్దు

- పీడీఎస్‌యూ
- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆర్మూర్

నిరుద్యోగులపట్ల కేసీఆర్ ప్రభుత్వం వ్యవహరించిన దుర్మార్గపు ధోరణి మూలంగానే హైకోర్టు గ్రూప్- 1 పరీక్షను రద్దు చేసిందని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. గ్రూప్-1 రద్దును నిరసిస్తూ ఏరియా కమిటీ అధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ధర్నా నిర్వహించి అనంతరం కేసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్ దుర్గా ప్రసాద్ , ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ మాట్లాడుతూ గ్రూప్1 పరీక్ష రద్దు చేయడం అంటే కేసీఆర్ పాలనకు పరాకాష్టనీ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నుండి ఉద్యోగాల భర్తీ విషయంలో మోసపూరితమైన వైఖరి, నిరుద్యోగుల పట్ల కపట ప్రేమ తేటతెల్లం అయ్యిందని తెలిపారు. గతంలో టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తే రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదు అన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి నిజాయితీగా, చిత్తశుద్ధితో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం కూడా చేతకాని ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది బిఆర్ఎస్ ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. తెలంగాణా ప్రభుత్వం ఒక పక్క అడ్డదిడ్డంగా, ఇష్టానుసారంగా నోటిఫికేషన్లు ఇవ్వడం, మరో పక్క ఎవరో ఒకరు కోర్టుకెళ్లడం నోటిఫికేషన్‌పై కోర్టులు స్టే ఇవ్వడం వలన నిరుద్యోగులు అన్యాయం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోలేదనే కారణంగా హైకోర్టు గ్రూప్ 1 పరీక్ష రద్దు చేయడం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నారు. తక్షణమే టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డిను తొలగించి బోర్డును ప్రక్షాళన చేయాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వ నిర్లక్ష్య, మోసపూరిత వైఖరికి నిరసనగా ప్రభుత్వ దొల్లతనం బట్టబయలు చేస్తు నిరుద్యోగుల గోడు అవేశ ఆక్రందనలు వినిపించేలా పెద్ద ఎత్తున విద్యార్థులు, నిరుద్యోగులు వచ్చే ఎన్నికల్లో ఈ కేసిఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిద్ధార్థ, అనిల్, నితిన్ ,రణవీర్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రశాంత్ రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని నెహ్రూ నగర్ మదీనకాలనీ చెందిన పహిల్వాన్ బిరదరి మైనార్టీ కమిటీ నుంచి 102 కుటుంబాలు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాలను సోమవారం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, స్థానిక నాయకులకు అందజేశారు.ఈసందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ బాల్కొండ నియోజవర్గంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి వైపు మా ఓటు అంటూ బాల్కొండకు చెందిన 102 ముస్లిం కుటుంబాలు కలిసి తీర్మాన పత్రాలను అందజేశారని తెలిపారు.సంఘ సభ్యులు మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కి ఓటు వేస్తామని ప్రమాణం చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ వాహబ్,మాజీ కో ఆప్షన్ సభ్యులు %హీూ% షాహిద్,మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాజ్ అలీ,వేల్పూర్ మార్కెట్ డైరెక్టర్ సయ్యద్ మాజారోద్దీన్, వార్డు సభ్యులు సయ్యద్ రియాజ్ అలీ, మైనార్టీ నాయకులు షేక్ ఆరిఫ్,కమిటీ అధ్యక్షుడు రహీం, సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థమే కార్యాలయం

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉపకార్య నిర్వాహక
- ఇంజనీర్ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఉపకార్య నిర్వాహక ఇంజనీయర్ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సౌకర్యాల మేరకు మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉపకార్య నిర్వాహక ఇంజనీరింగ్ కార్యాలయం ప్రారంభించుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. సహకరించిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రత్యేక కతజ్ఞతలు



ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న అధికారులు, నాయకులు

తెలుపుతున్నానని పేర్కొన్నారు.రూరల్ నియోజకవర్గం లోని సిరికొండ, డిచ్ పల్లి మండల గ్రామాలను కలిపి ఉపకార్య నిర్వాహక ఇంజనీయర్ కార్యాలయం ప్రజలకు అందుబాటులోకు వచ్చిందన్నారు. నిజామాబాద్ 1 నిజాంబాద్ 2, డిఈ ఆఫీసులో ఉండే, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ కార్యాలను ప్రారంభించామని చెప్పారు. కాంట్రాక్టర్లు ప్రజాప్రతినిధులు, వారు చేసిన సిసి రోడ్స్, బిల్డింగ్స్ నిర్మాణాలకు పనులను కంప్లీట్ చేసి వాటి మెజర్మెంట్, బిల్లింగ్ చేయడానికి అందుబాటులోకి ఈ కార్యాలయం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, జెడ్పిటిసి లక్ష్మీ నర్సయ్య, డిఈఈ శంకర్ నాయక్, ఎంపిడిఓ టీవీఎస్ గోపి బాబు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కర్యధర్శి హరికిషన్ , మోహన్ రెడ్డి, నడిపన్న, షేక్ అమీర్, శక్కెర కొండ కష్ణ, మోహమ్మద్ యూసుఫ్, చకలి సాయన్న ఒడ్డేమ్ నరసయ్య, అయా గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్లు ఎంపిటిసిలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాలకు బియ్యం వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి వినయ్ రెడ్డి గణేష్ మండపాల నిర్వాహకులకు 400 క్వింటాళ్ల బియ్యాన్ని సోమవారం వితరణ చేశారు. నియోజకవర్గంలోని మాక్లూర్, నందిపేట్, ఆలూరు, డొంకేశ్వర్, ఆర్మూర్ టౌన్, రూరల్ గ్రామాల్లోని పలు గణేష్ మండపాల నిర్వాహకులకు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు గణేష్ మండపాల నిర్వాహకులు ఆయన్ను శాలువాతో సన్మానించారు.



బియ్యం అందజేస్తున్న వినయ్‌రెడ్డి

నిర్మల హృదయ హైస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు జాతీయ బిసి విద్యార్థి సంఘం వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిర్మల ఉదయ హై స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు నవాతే ప్రతాప్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నావాతే ప్రతాప్ మాట్లాడుతూ.. నిర్మల హృదయ యాజమాన్యం కనీసం పేరెంట్స్ మీటింగ్ పెట్టకుండా ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతుందన్నారు. ఇన్స్టాల్మెంట్‌లో డబ్బులు పే చెయ్యాలని కండిషన్లు పెట్టడం, అబ్బాయిలలో బాలికలను ఒకే బెంచ్ లు కూర్చోబెట్టడం చేస్తుందన్నారు. యాజమాన్యం ప్రమీల మేడం విద్యార్థుల పట్ల దురుసుగా మాట్లాడడం ఒక క్లాస్ రూమ్ లో 50 నుంచి 60 మంది విద్యార్థులను కూర్చోబెట్టడం చేస్తున్నారన్నారు. ఈ విషయాలపై పరిమార్లు డిఈఓకు చెప్పిన పట్టించుకోకపోవడంలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే డిఓ ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నావాతే ప్రతాప్ వైశాఫీ సంతోష్, పరమేష్, ప్రసాద్, వెంకట్, చిన్న, గణేష్ యాదవ్, విక్రం రెడ్డి నిర్మల ఉదయ పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల మానవహారం

- సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి

నవతెలంగాణ - ముప్కాల్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్ వాడి ఉపాధ్యాయులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 15వ రోజుకు చేరుకుంది. తహశీల్దార్ కార్యాలయంలో అంగన్ వాడి ఉపాధ్యాయులు తమ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొందరగా పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ వనజ రాణికి వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ ప్రాంతంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మానవహారం సైతం నిర్వహించారు.అనంతరం అంగన్ వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు వసంత మాట్లాడుతూ గత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేపట్టిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకవైపు రాష్ట్రంలో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామంటూ, తమ పట్ల చిన్నచూపు చూడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు వసంత, అమినా బేగం, వాణి, జ్యోతి, వరలక్ష్మీ, పద్మ, భాగ్యలక్ష్మి, సరిత, మేఘన తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై మహిళలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం పరిశుభ్రత పై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ సక్కరం అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా నిల్వ ఉంచాలని సూచించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ చెత్తను సేకరించేందుకు వచ్చినప్పుడు అందులో కూడా తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగానే వేయాలన్నారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎంతో ముఖ్యమని తెలిపారు.ఇంటి పరిసరాల్లో పాడైన వస్తువుల్లో రోజుల తరబడి నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, వార్డు సభ్యులు నీలిమ, గిరిజ, శారద, శ్యామ్, గణేష్, లావణ్య, ఇందుమతి, ఎర్రవ్వ పోషన్న, సాగర్, విజయ, నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలానికి మంత్రి రాక

నవతెలంగాణ - ముప్కాల్

బాల్కొండ నియోజకవర్గంలోని పలు మండలాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొంటారని అధికార పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం ముప్కాల్ మండల కేంద్రంలో రూ.1.95 కోట్లతో (ముప్కాల్ నుండి మెండోరా) వరకు బిటి రోడ్డు రినివల్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాల్కొండలో స్వచ్ఛత హీ సేవ



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ప్రజలు

నవతెలంగాణ-బాల్కొండ

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సర్పంచ్ బూస సునీత ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని గ్రామంలో పరిశుభ్రతను పాటించి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకాంత్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్,డాక్టర్ శ్రీకాంత్, మహిళా సంఘాల వివోలు, ఆసుపత్రికి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెంజర్ల పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా..

- జక్కుల రవి కుమార్

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల ప్రభుత్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా జక్కుల రవి కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల బృందం ఆయనకు ఘన స్వాగతం పలికారు. పీఆర్టీయూ మండల పక్షాన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు సామ ప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సురేష్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదు పాఠశాలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు

- ఎంఈఓ ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు నూతనంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బాధ్యతల స్వీకరించినట్లు మండల విద్యాధికారి ఆంధ్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కే. రాజన్న, కమ్మర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పి. సాయన్న, హాస కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా డిఎల్ ఎన్ చారి, కోన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులుగా బి. మధుపాల్, కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సిహెచ్ రాంప్రసాద్ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.ఆ దివారం జరిగిన పదోన్నతుల్లో ప్రమోషన్ పొంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా మండలంలో జాయిన్ అయినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

అంతర పాఠశాల క్రీడల్లో కృష్ణవేణి పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేసిన ప్రిన్సిపాల్

నవతెలంగాణ - ముప్కాల్

మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉమ్మడి బాల్కొండ అంతర పాఠశాల క్రీడోత్సవాల్లో పాల్గొని మిశ్రమ ఫలితాలను సాధించారని ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్ తెలిపారు. అంతర పాఠశాల అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో తమ పాఠశాల విద్యార్థిని అనన్య యాదవ్ ప్రథమ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని నాగారం స్టేడియంలో జరిగిన 100 మీటర్ల పరుగు పందెంలో అనన్య యాదవ్ ద్వితీయ స్థానం పొంది సిల్వర్ మెడల్స్ సాధించడం జరిగిందన్నారు. ఈ నెల 14 నుండి 16 వరకు జెడ్పిహెచ్ఎస్ కిసాన్ నగర్‌లో నిర్వహించిన క్రీడల్లో యూపిఎస్ విభాగంలో ఐదు షీల్డ్ లు పొందినట్లు తెలిపారు. వీటితో పాటు అథ్లెటిక్స్‌లో కూడా ఐదు బహుమతులు, మార్చ్ ఫాస్ట్ విభాగంలో ద్వితీయ స్థానం, సబ్ జూనియర్ బాలుర విభాగం ఖో-ఖోలో ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో ద్వితీయ స్థానం, బాలుర కబడ్డీలో ద్వితీయ, బాలికల కబడ్డీలో ద్వితీయ స్థానాలు పొందారని పేర్కొన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో క్రీడాకారులకు అభినంద సభ చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ చవాన్, డైరెక్టర్ శాకని నర్సయ్య, సాందర్కర్ రాజేందర్, పీఈటి ఫసివుద్దీన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హెల్త్ కౌన్సిలర్ ప్రవీణ్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రముఖులు

తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుదీర్ఘ వెబినార్లో భాగంగా ఆత్మహత్యల నివారణపై వైద్య ఆరోగ్యశాఖలో ఇఆర్టి కౌన్సిలర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వడియాల ప్రవీణ్ రెడ్డి ప్రసంగించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. ఉరుకులు పరుగులు జీవితంలో ప్రతి మనిషి మానసిక ఒత్తిళ్లకు గురవుతుంటారని ఆరోగ్యం పై దష్టి సారించే విధంగా సైకాలజిస్టులు కషి చేయాలని రాష్ట్ర నీటిపారుదల అభివద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న డాక్టర్ వడియాల ప్రవీణ్ రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందించారు. తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రామచందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సముద్రాల వేణుగోపాల చారి హాజరై మాట్లాడారు. మంచి ఆలోచనలతో అందమైన జీవితాన్ని ఏర్పరచుకొని నిత్యం శారీరక వ్యాయామం యోగా చేస్తూ మానసిక ప్రశాంతత పొందాలన్నారు. అనంతరం డాక్టర్ వడియాల ప్రవీణ్ రెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | సెప్టెంబర్ 26, 2023 | www.navatelangana.com

ప్రజావాణికి 150 ఫిర్యాదులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, డీపీఓ జయసుధలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి

నవతెలంగాణ-నవీపేట్

పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడిపాటి ప్రకాశ్ రెడ్డి బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు సరిన్, మనోహర్, ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, గంగాధర్, పిల్లి శ్రీకాంత్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలి

- అవినీతిపై విచారణ చేపట్టాలి
- కాంగ్రెస్ నాయకులు
- మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై, అవినీతిపై విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్‌కు సోమవారం కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు కోల వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అవినీతి పెరిగిందని, అక్రమంగా కేటాయించిన ఇంటి నంబర్ల పై విచారణ చేయాలని, అక్రమ కట్టడాలను తొలగించాలి అని, హరితహారం మొక్కల పెంపకంలో నిధుల దుర్వినియోగం పై విచారణ చేపట్టాలని అన్నారు, పట్టణంలో కుక్కల, కోతుల బెడదతొ ప్రజలు ప్రాణాలపైకి వస్తుందని, వాటిని నివారించాలని తెలిపారు. అర్హులకు పెన్షన్ల మంజూరులో జాప్యం చేస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే మంజూరు చేయాలని అన్నారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైందని, సుందరీకరణ కాకుండా మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని అన్నారు. గణేష్ నిమజ్జన శోభాయాత్ర జరిగే రోడ్లను బాగుచేయాలనీ, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అంబేద్కర్ చౌరస్తాలో గల ధర్నా చౌక్ లో పెట్టిన అధికార పార్టీ కట్ అవుట్ తొలిగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మీర్ మాజిద్, జిమ్మి రవి, రవికాంత్ రెడ్డి, బాల కిషన్, అబ్దుల్ ఫయామ్, పెద్ద పోశెట్టి, హబీబ్, బంద ప్రసాద్, ఉదయ్, అలీమ్, భగత్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెగా రక్తదాన శిబిరం విజయవంతం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రముఖ సామాజిక సేవకుడు, ఉద్యమకారుడు రైతు నాయకుడు కోటపాటి నరసింహ నాయుడు తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని పెర్కిట్ ఎం ఆర్ గార్డెన్ లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం అయింది.. కోటపాటి తన ప్రతి పుట్టినరోజున యువకులను ప్రోత్సహించి రక్తదాన శిబిరాలు నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. పట్టణంలోని మెగా రక్తదాన శిబిరంలో దాదాపు 100 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్ విచ్చేసి కోటపాటి చేస్తున్న సామాజిక సేవను యువకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు జక్కుల శ్రీధర్, తులసి దాస్ క్రాంతి, ఎం కె నరేందర్, చరణ్, భూపతిరెడ్డి, బట్టి మధు, ఏరుగట్ల గణేష్, శ్రీనివాస్ ఎం కె నాగరాజు, రక్తదాన శిబిరం చేయూత స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కొక్కుల విద్యాసాగర్, కోఆర్డినేటర్ ఊరే బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మ యుద్ధం ర్యాలీకి తరలిన ముదిరాజ్‌లు


ర్యాలీకి తరలిన ముదిరాజ్‌లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన ముదిరాజ్ ల ధర్మయుద్ధం ర్యాలీకి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం లోని ఏడు మండలాలు, గ్రామాల నుండి ముదిరాజ్ కులస్తులు వందలాది సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఇందల్వాయి టోల్ ప్లాజాలో జిల్లా నలుమూలల నుండి కామారెడ్డికి బయలుదేరే ముదిరాజులు ఏకమై ఒకేసారి తరలి వెళ్లారు. ప్రభుత్వాలు ఏది వచ్చిన ముదిరాజులను గుర్తించడం లేదని ఎన్నికల్లో ముదిరాజ్ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. తరలి వెళ్లిన వారిలో జిల్లా, మండల, రాష్ట్రస్థాయి, గ్రామస్థాయి ముదిరాజ్ నాయకులు ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో మంత్రి సోదరుడు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాలు, గహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సోదరుడు డాక్టర్ వేముల అజయ్ రెడ్డి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యువత ఆహ్వానం మేరకు కమ్మర్‌పల్లికి విచ్చేసిన ఆయన స్థానిక రైజింగ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 30 మంది చిన్నారులకు పెన్నులు, నోటు పుస్తకాలు, బ్లాంకెట్లు వితరణ చేశారు.వాటిని అజయ్ రెడ్డి చేతుల మీదుగా వినాయక మండపం వద్ద చిన్నారులకు అందజేశారు. యూత్ సభ్యులు అజయ్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రైజింగ్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులను అజయ్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రాజా గౌడ్, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, యూత్ అధ్యక్షులు కొత్తపల్లి రఘు, గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న అజయ్‌రెడ్డి

బిజెపి నాయకుల అక్రమ అరెస్టు

ప్రేమపేరుతో అమ్మాయిపై హత్యాయత్నం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని చందమియ బాగ్ సర్పంచ్ కిషన్ నాయక్ ఆరోపించారు. మండలంలోని బిజెపి నాయకులందరినీ అక్రమంగా పోలీసులు అరెస్టు చేశారని కిషన్ నాయక్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమ పేరుతో ముస్లిం అబ్బాయి హత్యాయత్నంచేయడంతో ఆమె మృత్యువుతో పోరాడుతోందన్నారు. ఇది తెలుసుకొని పరామర్శించడానికి, ర్యాలీలో పాల్గొనడానికి వెళ్లకముందే బిజెపి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి మూడు గంటలపాటు పోలీస్ స్టేషన్‌లో ఉంచారని పేర్కొన్నారు. ప్రేమ పేరుతో అమ్మాయిని చంపిన ఇద్దరు వ్యక్తులను ఉరిశిక్షవేసి కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్అండ్‌బీ అధికారులపై ఆగ్రహం

నవతెలంగాణ-నవీపేట్

ప్రత్యేక సమావేశాలకు సైతం గైర్హాజరవుతున్న ఆర్అండ్‌బి అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే గణేష్ నిమజ్జనం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై యాదగిరి గౌడ్ అధ్యక్షతన సోమవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మీనా నవీన్ రాజ్ తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు ఆర్ అండ్ బి అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గణేష్ నిమజ్జనంలో రోడ్లపై గుంతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పలుమార్లు సూచించిన ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పాలకవర్గం నాయకులు కలిసి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయాలని నవీన్ రాజ్ అన్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగితే అధికారులే బాధ్యత వహించాలని పిల్లి శ్రీకాంత్ అన్నారు. మండలం కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు గుండా విచ్చేసే గణపతులకు అధికార యంత్రాంగం ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని రూట్ మ్యాప్ వేసి ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని ఎంపీపీ సంగెం శ్రీనివాస్, సర్పంచ్ ఏటీయస్ శ్రీనివాస్ అన్నారు. ప్రశాంత వాతావరణంలో గ్రామ పెద్దల సహకారంతో గణేష్ నిమజ్జనాన్ని విజయవంతంగా జరుపుకుంటామని, యంచ గోదావరి వద్ద సైతం క్రేన్, విద్యుత్ మరియు రక్షణ చర్యలు చేపట్టామని వందమంది వాలంటీర్లు సైతం సిద్ధంగా ఉన్నారని ఎస్సై యాదగిరి గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజిద్ అలీ, ఉప సర్పంచ్ కరిపే మల్లేష్, అల్తాఫుద్దీన్, తెడ్డు పోశెట్టి, సూరిబాబు, లోకం నర్సయ్య, గంగాధర్, గ్రామాల పెద్దలు, నాయకులు హాజరయ్యారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడాలి

- మండల మహిళా సమాఖ్య తాత్కాలిక కమిటీ నియామకం..
- ఎంపీపీ బాదావత్ రమేష్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహిళా సంఘాల ఆర్థిక అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కషి చేస్తుందని దానికిగాను వెనుకబడ్డ సంఘలను పైకి తేవడానికి మండల మహిళా సమాఖ్య సభ్యులు కలిసికట్టుగా కషి చేయాలని, ఇప్పుడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని ఎంపీపీ బదావత్ రమేష్ నాయక్ అన్నారు. సోమవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మండల మహిళా సహకార సమైఖ్య మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్బంగా తాత్కాలిక మండల మహిళా సమాఖ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ భదవత్ రమేష్ నాయక్ హాజరై మాట్లాడుతూ.. ఒకప్పుడు ఇంటికే ఫలితమైన పరిమితమైన మహిళలు నేడు కోట్ల రూపాయల మీద బ్యాంకులనుండి రుణాలు పొందుతూ వ్యాపారంలో ఆర్థిక అభివద్ధి సాధించడం శుభసూచకమని అన్నారు. రాబోవు రోజుల్లో మహిళలు పరిశ్రమలు నెలకొల్పే విధంగా చూడాలన్నారు. ముందుగా మహిళల రిజర్వేషన్ ఆమోదం పొందడం పట్ల మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకులు సంఘాల బలోపేతానికి లక్షలకోట్ల రూపాయల మేర రుణలను అందజేస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల సమక్షంలో ప్రతి ఏడాది కోట్ల రూపాయల మేర లావాదేవీలు జరగడం హర్షించదగిందని రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివద్ధిపై ప్రత్యేక దష్టి కేంద్రీకరించి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అంతకుముందు కొన్ని నెలలపాటు మండల మహిళా సమాఖ్య తాత్కాలిక కమిటీ ఇచ్చే ప్రమాణ స్వీకారం చేయించారు. అవసరమున్న వారందరికీ బ్యాంకుల ద్వారా రుణాలను అందజేసే విధంగా మండల కమిటీ కషి చేయాలని రమేష్ నాయక్ సూచించారు. సంఘాల ద్వారా పేదరికాన్ని తొలగించడమే కాకుండా ఎన్నో సామాజిక కార్యక్రమాల ద్వారా సామాజిక సేవతో కూడా మన వంతు పాత్ర పోషించాలన్నారు. కుటుంబంతోపాటు సమాజంలో అత్యున్నత గౌరవం పొందుతున్నా మని తెలిపారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది లేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ సాధించడానికి ముఖ్యపాత్ర పోషించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా సుజాత, ఉపాధ్యక్షుడుగా శ్యామల, కార్యదర్శిగా లింగమణి, కోశాధికారిగా పద్మ, సహాయ కార్యదర్శిగా గోదావరి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం సువర్ణ, సీసీలు ఉదయ్ కుమార్, గోవింద్, అనురాధ, ఎమ్మెస్సీఓ రాజు, సుజాత, మండలంలోని గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ

కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదు

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని భారతీయ జనతా పార్టీ ఐటీసెల్ జిల్లా అధ్యక్షులు నరేష్ గౌడ్, యువమోర్చా కంఠేశ్వర్ మండల అధ్యక్షులు సాయిని అక్రమంగా అరెస్టు చేసి నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి 4 టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెల్లారు. ఈ సందర్భంగా నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ ముందు కొద్దిసేపు ధన్‌పాల్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాను ఎదుర్కోలేక కార్యకర్తలను అరెస్ట్ చేసి టౌన్‌లో ఉంచడం సమంజసం కాదన్నారు వారేమైనా నక్సలైట్లా.. టెర్రరిస్టులా.. వారి ఇంటి మీదికి ఉదయం వెళ్లి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. పోలీసులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తుందన్నారు. కార్యకర్తలు ఎవరు భయపడొద్ద, అండగా నేనుంటాను అని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు ఉపాధ్యక్షులు నాగొల్ల లక్ష్మీనారాయణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బంటు రాము కార్పొరేటర్ మాస్టర్ శంకర్ సుక్క మధు ఇప్పకాయల కిషోర్, గోపిడి వినోద్ రెడ్డి యువ మోర్చా అధ్యక్షులు సందగిరి రాజశేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు


అరెస్టు అయిన నాయకులు

తెలంగాణ ప్రభుత్వ ఆసమర్థతవల్లే గ్రూప్-1 పరీక్ష రద్దు

నవతెలంగాణ-మాక్లూర్

తెలంగాణ ప్రభుత్వ అసమర్థ పాలనపై బీజేవైఎం మండల శాఖ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అధ్వర్యంలో సోమవారం రాజ్యాంగ నిర్మాత డా. బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసనకార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, టిఎస్పిఎస్ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా గ్రూప్ - 1 ప్రిలిమ్స్ రాద్దు కావడం జరిగిందన్నారు. బిజెవైఎం అనేక ఉద్యమాలు, పోరాటాలు, నిరసనల వల్ల తలొగ్గిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసిందన్నారు. అయితే ఎన్నో ఏళ్ల తర్వాత చేపట్టిన ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియలో బాధ్యతా రాహిత్యం కారణంగా అనేక అవినీతి, అక్రమాలు, టిఎస్పిఎస్ ప్రశ్న పత్రాల లీకేజీ, తప్పుల తడకగా పరీక్ష పత్రాల వ్యవహారాలు గందరగోళంగా మారి రాష్ట్రంలోని అభ్యర్థులను, యువతను, విద్యార్థులను, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తూ, వారిని మానసిక ఒత్తిడికి గురిచేయడం బాధాకరమైన అంశమని అన్నారు.నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతన్న సిఎం కేసీఆర్ ఈ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామక పరీక్షలను ఎటువంటి ఆరోపణలకు, అవకతవకలకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించలేని టిఎస్పిఎస్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించి బోర్డ్ ను సమూల ప్రక్షాళ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సురేష్ నాయక్, జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్ , ఓ బిసి మోర్చ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ గంగోనే వినోద్, సీనియర్ నాయకులు రమేష్, శివలాల్, రవి యాదవ్, హరీష్, బలరాం నాయక్, గంగారాం నాయక్, సంజీవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తే తస్మాత్ జాగ్రత్త

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వినయ్ రెడ్డి


పార్టీ కండువా వేస్తున్న వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నపూర్ గ్రామంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్, బీజేపీల పార్టీల నుంచి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ షేక్ హైమద్ అధ్యక్షతన బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నుంచి కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు ఒడ్డెర కాలనీ లక్ష్మి, వార్డ్ మెంబర్ గౌడ రాధ, ఎర్ర సాయిలు యువకులు, గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ చేరారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఈసారి కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటేసిన పాపానికి కొత్తగా రేషన్ కార్డు ఇచ్చింది లేదన్నారు. ఆసరా పింఛన్లు మంజూరు చేసింది లేదన్నారు. నిత్యవసరాల ధరలు, బస్సు చార్జీలు, కరెంటు చార్జీలు పెంచుకుంటూ పోతూ ప్రజలని ఆగం చేసిందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లు కట్టిన దాఖలాలు లేవనీ, నియోజకవర్గంలో ప్రతి మండలంలో కబ్జా చేసిందే తప్ప అభివద్ధి చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ సమక్షంలో చేరిన మహిళలకు, పెద్దలకు, యూత్ క్యాడర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్ మండల అధ్యక్షులు రవి ప్రకాష్ గారు,ఉప సర్పంచ్ షేక్ హైమద్, మాజీ వీడీసీ అధ్యక్షులు పుప్పాల చిన్న, గ్రామ అధ్యక్షులు మహేష్, గోవుల పెద్ద గంగాధర్, శ్రీకాంత్, చింటు, సాగర్, భుమన్న, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల

నవతెలంగాణ-దోమకొండ(బీబీపేట)

జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల సమస్యలకు నిలయంగా మారిందని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. బీబీపేట్ మండల కేంద్రంలో గల జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదం అరుణ్, భారతీయ విద్యార్థి మోర్చ బీవీఎం రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీబీపేట మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే సమస్యలు తీర్చాలని వారు కోరారు.

రెండు గ్రామాల్లో మహాజన సభ



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని రెండు గ్రామాల్లో మహాజనసభను సోమవారం నిర్వహించారు. సదాశివనగర్ రైతు వేదికలో సదాశివనగర్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు కమలాకర్‌రావు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. కార్యదర్శి విగ్నేష్ గౌడ్ ఆదాయ వ్యయాలను రైతులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. రుణమాఫీ వచ్చిన 26 మందికి, మరో ముగ్గురు రైతులకు మొత్తం 29 మంది రైతులకు కొత్త రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. వడ్డీలు చెల్లించి రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ధర్మారావుపేట్ గ్రామంలో 250 మెట్రిక్ టన్నుల గోదాంను త్వరలో నిర్మిస్తామని అన్నారు. కొత్త సభ్యత్వం కోసం రూ.500లు చెల్లించాలని తెలిపారు. వరి కొనుగోలుపై ఇప్పటికీ కమీషన్ రాలేదని రైతులకు తెలిపారు. యూనియన్ బ్యాంకు కంటే మన సొసైటీలో ఋణాలు ఇస్తామని అన్నారు. ఉత్నూర్ సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. కార్యదర్శి నహిమొద్దీన్ సంఘం ఆదాయ వ్యయాలను రైతులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పీర్‌సింగ్, వజ్జపల్లి సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉత్నూర్ ఎంపిటిసి చందర్‌రావు, సదాశివనగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు వడ్లం పాఠశాల విద్యార్థిని

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని వడ్లమ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్టు పి.ఈ.టి. ధర్మేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం వరంగల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫౌండేషన్ పోటీలలో భాగంగా అండర్-14 విభాగం కుస్తీ పోటీలలో ప్రథమ స్థాయి సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో ప్రథమ స్థానం సాధించి పాఠశాలకు పెరు తీసుకువచ్చిన సుజితను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో రానున్న కొద్దిరోజుల్లో ఛత్తీస్‌ఘఢ్ లేదా ఢిల్లీలో కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రేమ పేరుతో అమ్మాయిపై హత్యాయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- యువజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రేమ పేరుతో అమ్మాయిపై హత్యాయత్నం చేసిన ఇద్దరు యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. జక్రాన్ పల్లి గ్రామంలో ప్రేమ పేరుతో అమ్మాయిని ఓ ముస్లిం అబ్బాయి కిరాతకంగా చంపేశారని అన్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈసదర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మాయిపై హత్యాయత్నం చేయడంతో ఆమె పరిస్థితి ఆందోళన కరంగా ఉందన్నారు. ఆ ఇద్దరు యువకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ర్యాలీలో అధిక సంఖ్యలో దళితులు పాల్గొన్నారు.